క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దైవాలరావూరులో ఒకటి, యర్రబాలెంలో ఒకటి వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రెండు పోస్టులకు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు గల ఎస్సీ (మహిళ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 13వ తేదీ నుంచి 19 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 21, 22 తేదీల్లో పరిశీలన, 25 నుంచి 27 వరకు ఇంటర్వ్యూలు, 29న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తారని ఎంపీడీవో ప్రకటనలో తెలిపారు.

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఐదు గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ తెలిపారు. మండలంలోని రామకృష్ణాపురంలో 2, విజయనగర్ కాలనీలో 1, గవినివారిపాలెంలో 1, చీరాలనగర్‌లో 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రిజర్వేషన్లు, తదితర వివరాల కోసం ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19లో దరఖాస్తులు చేయాలన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జే.పంగులూరు: ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. పంగులూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం పంగులూరు రోటరీ క్లబ్‌నందు జరిగింది. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, 2 డీ ఎకో ఉచిత చేసినట్లు తెలిపారు. ఈక్యాంప్‌లో 150 మందికి గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి అదనపు పరీక్షలు నిమిత్తం హాస్పిటల్‌కి సిఫార్సు చేశారు. ఈ వైద్యశాలలో గుండె సంబంధిత వైద్య నిపుణుడు డాక్టర్ జ్వాలాసాయి, పీఆర్‌ఓ సతీష్, వైద్య బృందం రోటరీ సభ్యులు పంట్యాల జగదీశ్వరరావు, గుర్రం ఆంజనేయులు, పోతిన ప్రసాద్, చిలుకూరి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు


ప్రమాదానికి గురైన వ్యక్తి

మేదరమెట్ల: మోటారు బైకు అదుపుతప్పి కిందపడిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం కొరిశపాడు సమీపంలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం వైపు నుంచి కొరిశపాడు వైపుకు సర్వీస్ రోడ్డులో మోటార్ బైకుపై వెళ్తున్న ఓ వ్యక్తి బైకు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వ్యక్తి పూర్తి వివరాలు తెలియరాలేదు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

చీరాల అర్బన్: శ్రావణమాసం సోమవారం సందర్భంగా పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న పునుగు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


కొప్పరపాలెంలో కళకళలాడుతున్న పత్తి


కేవీ పాలెంలో బెండకాయలు కోస్తున్న కూలీలు

వాన కురిసెను.. జీవం పోసెను

- వర్షాలతో కళకళలాడుతున్న మెట్ట పైర్లు

బల్లికురవ/జే.పంగులూరు: అల్పపీడన ప్రభావంతో 20 రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మెట్టభూముల్లో సాగుచేసిన వివిధ పైర్లు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. మండలంలోని బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, కె. రాజుపాలెం, వేమవరం, గంగపాలెం, ముక్తేశ్వరం, ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, మల్లాయపాలెం, కొప్పరపాడు, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కోటావారిపాలెం, చెన్నుపల్లి, గుంటుపల్లి, వల్లాపల్లి, అంబడిపూడి గ్రామాల్లో మెట్ట భూములు అధికంగా ఉన్నాయి.

1220 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు...

ఖరీఫ్ పంటలుగా జూన్ నుంచి ఆగస్టు తెల్ల బంగారం పత్తి సాగుకు అధిక విస్తీర్ణంలో 400 హెక్టార్లలో చేపట్టారు. ఆగస్టు నుంచి మిర్చి సాగును ఇప్పటి వరకు 200 హెక్టార్లు మాత్రమే చేపట్టారు. సాగర్ ఆయకట్టులో నీటి విడుదల లేనందున మిర్చి సాగు విస్తీర్ణం ఏడాది తగ్గింది. బోర్లకింద మాత్రమే సాగు చేస్తున్నారు. కూరగాయాలైన బెండ, దోస, గుమ్మడి, గోరుచిక్కుడు, వంగ తోటలను 240 హెక్టార్లలో చేపట్టారు. వల్లాపల్లి, వేమవరం, కూకట్లపల్లి, గొర్రెపాడు, రామాంజనేయపురం, కొప్పరపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాల్లో పండ్ల తోటలైన మామిడి, బొప్పాయి, సీతాఫలం, జామ, అల్లనేరేడు, నిమ్మ 120 హెక్టార్లలో సాగు చేశారు. జూట్ 200 హెక్టార్ల సాగులో ఉంది. పప్పుధాన్యాలైన కంది, పెసర, మినుము, 260 హెక్టార్లలో సాగుచేశారు.


వేమవరంలో పండ్ల తోటల సాగు

ఇటీవల కురుస్తున్న, వర్షాలకు చెట్టు పూర్తిగా తడవటంతో పూత పిందెతో కళకళలాడుతోంది. ఈ వర్షాలకు చీడపీడల నుంచి విముక్తితో పైర్లన్నీ కళకళలాడుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా మిర్చి సాగు..

గత మూడు వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంట భూములు పదునెక్కాయి. పంటలు వేయడానికి సరిపడ తేమ భూమిలో ఉంది. ప్రస్తుతం కురిసిన వర్షాలు పత్తి పంటకు కూడా అనుకూలంగా ఉంది. గత నెల వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిర్చి నారుమళ్ల మొక్కలు సాగుకు వచ్చాయి. దీంతో గత వారం రోజుల నుంచి మండలంలోని కురుస్తున్న వర్షాలకు రైతులు మిర్చి పంట వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. గతేడాది మండలంలో పత్తి పంట 1639 ఎకరాలలో విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ సంవత్సరం పత్తి పంట రెట్టింపు అయ్యే అవకాశం వుంది. గతేడాది మిర్చి 5500 ఎకరాల విస్తీర్ణంలో వేశారు. ఈఏడాది మిర్చి పంటకు ఇంచు మించు 6700 ఎకరాల పైమాటే సిద్ధం చేశారు. ఇప్పటికే మండలంలో 1000 ఎకరాల వరకు మిర్చి సాగుచేశారు. ఇలాగే మరికొన్ని రోజులు వానలు కురవాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


బూదవాడలో మిరప నాటుతున్న కూలీలు


డ్రిప్ కింద సాగుచేస్తున్న మిర్చి

ఈ వర్షాలు జీవం పోశాయి..



ఎకరాన్నరలో పత్తి సాగు చేపట్టాను. 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్టు పూర్తిగా తడవటంతో పూత పిందెతో కళకళలాడుతోంది. ఈ వర్షాలకు చీడపీడలు కూడా తొలగిపోయాయి. ఈఏడాది పత్తి ఆశాజనకంగానే ఉంది.

జీ సీతారెడ్డి, కొప్పరపాలెం

పండ్లతోటల సాగులో లాభాలు..



బోర్లకింద పండ్లతోటలైన అల్ల నేరేడు, బొప్పాయి, జామసాగు అంతర పంటలతో లాభాలు గడిస్తున్నా. నాలుగేళ్లుగా అదునులో వర్షాలు కురవటం, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలతో వ్యవసాయం లాభసాటిగానే ఉంది.

ముత్యాలరావు, వేమవరం

15లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి..



రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నిటినీ ఈనెల 15లోపు వ్యవసాయ శాఖ వీఏఏల ద్వారా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి. సున్నా వడ్డీ, వైఎస్సార్ బీమా పంట ఉత్పత్తులను అమ్ముకోవటంతో పాటు విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చు. సాగర్ కాల్వల ద్వారా ఈ ఏడాది వరి సాగుకు నీరిచ్చే పరిస్థితులు లేవు. మాగాణి భూముల్లో సైతం ఆరుతడి పంటలు సాగు చేపట్టాలి.

– ఎస్‌వీపీ కుమారి, ఏవో

జగనన్న ప్రభుత్వంలో ఇంటింటా సంతోషం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పార్టీ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం చీరాల మున్సిపాలిటీలోని 20వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డులోని ప్రజలు సంక్షేమ పథకాల కోసం, సమస్యల పరిష్కారానికి వార్డు సచివాలయాన్ని సంప్రదించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం ఆకాంక్ష అని అన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సారథ్యంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి మరలా సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండ్రు బాబ్జి, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, 20వ వార్డు కౌన్సిలర్ శిఖాకొల్లి రామసుబ్బులు, సీహెచ్ బాలు, చుండూరు రామసాయి, గ్రంధి రామకృష్ణ, రామ విజేత, చుక్కా ఉమ, దోగుపర్తి ప్రవీణ్, అమర సురేష్, గుంటూరు మాధవరావు, మల్లెల లలిత, దాసరి రామకృష్ణ, బత్తుల అనిల్, కంపా అరుణ్, కే యానాదిరావు, గొట్టిపాటి ఎబినేజర్, మించాల సాంబశివరావు, షేక్ కబీర్, మామిడాల సుబ్బారావు, గోలి గంగాధర్, ఆసాది అంకాలరెడ్డి, పి.ధనుంజయ, పి.చంద్రమోహన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

స్పందన అర్జీలపై విచారణ

చినగంజాం: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే స్పందన అర్జీలను సోమవారం తహసీల్దార్ పీ పార్వతి విచారణ నిర్వహించారు. ఇందులో భాగంగా గొనసపూడి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుపై సిమెంట్ బల్లను ఉంచి గ్రామ ప్రజలు నడిచేందుకు ఇబ్బందిగా ఉండటంతో స్పందన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాచవరపు సుబ్బారావు తహసీల్దార్‌కు అర్జీ సమర్పించాడు. ఆ విషయమై సంఘటనా స్థలాన్ని సందర్శించిన తహసీల్దార్ సిమెంట్ బల్ల అడ్డంగా లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి సూచించారు. అదే విధంగా సంతరావూరు గ్రామంలో బండారు ఆంజనేయులు అనే వ్యక్తి 430/4లో ఎస్ఎస్‌పీ కాలువ డొంకని ఆక్రమించుకున్నారని బండారు శ్రీనివాసరావు, గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన తహసీల్దార్ ఎస్ఎస్‌పీ కాలువను ఆక్రమణ చేయడానికి వీలులేదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ శ్రీకాంత్, వీఆర్వో రాధిక, రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.


స్పందన అర్జీలను విచారిస్తున్న తహసీల్దార్ పార్వతి

టీడీపీ బంద్‌కు కనిపించని స్పందన

- యథావిధిగా నడిచిన ఆర్టీసీ సర్వీసులు, షాపులు

చీరాల/వేటపాలెం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం టీడీపీ చేపట్టిన బంద్‌కు ప్రజల నుంచి స్పందన లభించలేదు. వేటపాలెం, చీరాల పట్టణంలో టీడీపీ చేపట్టిన బంద్ ప్రభావం చూపలేదు. జిల్లాలో 30 ఏపీ పోలీస్ యాక్ట్ అమలులో ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, జనజీవనానికి విఘాతం కలగకుండా పోలీసులు ఉదయం నుంచే ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్ వద్ద బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు యాధావిధిగా నడిచాయి. అలానే దుకాణాలు మూతపడలేదు. జనసంచారం సజావుగా సాగింది. అన్ని ఆధారాలతో అడ్డంగా దొరికిన చంద్రబాబును మచ్చలేని నాయకుడు అని టీడీపీ శ్రేణులు చెప్పుకోవడం గమనార్హం.

పర్చూరు నియోజకవర్గంలో..

కారంచేడు/చినగంజాం: టీడీపీ పిలుపునిచ్చిన బంద్‌కు పర్చూరు నియోజకవర్గంలో ఎలాంటి స్పందన లేదు. టీడీపీకి కంచుకోటగా ఉన్న కారంచేడులో మాత్రం కనిపించలేదు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, పోస్టాఫీసులు కూడా యధావిధిగానే పనిచేసాయి. మార్టూరు మండలంలో పలు ప్రైవేట్ పాఠశాలలు ఆదివారం రాత్రి సెలవు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు యథావిధిగా పనిచేసాయి. సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్‌లు తమ బృందంతో ఆందోళనలు, రాస్తారోకోలకు అనుమతులు లేవంటూ ముందు జాగ్రత్త చర్యలో భాగంగా టీడీపీ నాయకులను అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో ఇదే పరిస్థితి కనిపించింది.


చీరాల గడియార స్తంభం సెంటర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


పర్చూరులో యథావిధిగా కొనసాగుతున్న దుకాణాలు

అద్దంకి రూరల్/బల్లికురవ:

అద్దంకి రూరల్: చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసన టీడీపీ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు బంద్ అద్దంకిలో బంద్ పాక్షికంగా జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో కొద్దిసేపు ఎమ్మెల్యే జీ రవికుమార్ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా పేరుతో హడావుడి చేయటంతో పోలీసులు ఎమ్మెల్యేను, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

బల్లికురవ: రైతులు సాగుచేసే పంటలన్నిటినీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మార్టూరు ఉద్యానవన శాఖాధికారి బీ. హనుమంతనాయక్ కోరారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో మిరప పంట ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. పంట నమోదుతో సున్నావడ్డీ, వైఎస్సార్ పంటల బీమా పంట ఉత్పత్తులు అమ్ముకోవటంతోపాటు విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చన్నారు. ఉద్యాన రైతులంతా ఈ నెల 15వ తేదీలోపు ఆర్‌బీకేలోని వీఏఏల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలని కోరారు.

అన్నదాతల సంక్షేమానికి సహకారం

చీరాల టౌన్: అందరికి అన్నంపెట్టే అన్నదాతలకు తమవంతుగా సహకారాన్ని అందిస్తామని ఐటీసీ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసశాస్త్రి అన్నారు. సోమవారం మండలంలోని గవినివారిపాలెం పంచాయతీలోని విజయలక్ష్మీపురంలో గ్రామసిరి, ఐటీసీ సహకారంతో రైతులకు ఉచితంగా వరి ఎదపట్టే యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలోని పది మంది రైతులు ఒక గ్రూపుగా ఏర్పడటంతో వరి, మొక్కజొన్న, వేరుశనగ విత్తనాలను ఎద పెట్టుకునే యంత్రాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ ఎర్రాప్రాయం, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి, జిల్లా కో–ఆర్డినేటర్ ఉదయ్‌భాస్కర్, ఏరియా కో-ఆర్డినేటర్ మహ్మద్‌బిక్కు, రైతులు పాల్గొన్నారు.


యంత్రాలను అందిస్తున్న ఐటీసీ అధికారులు

14, 15 తేదీల్లో ఆటల పోటీలు

మార్టూరు: మండలస్థాయి ఆటల పోటీలు ఈ నెల 14,15 తేదీల్లో వలపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎంసీహెచ్ వస్త్రాంనాయక్ తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కే ప్రేమలత, మండల కో ఆర్డినేటర్ కే పాల్ మిల్టన్, హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 నుంచి ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 30 నుంచి అక్టోబర్ 28 వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ సోమవారం తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటా సర్వే చేసి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తిస్తారన్నారు. సత్వరంగా వైద్య సేవలు అందించడంతో పాటుగా ప్రభుత్వ యాప్‌లో నిక్షిప్తం చేసి ప్రతి పౌరుడికి ఆరోగ్య శ్రీ సిటిజన్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో జరిగే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులకు, వలంటీర్లకు ఎంపీడీవో సూచించారు.

గృహ నిర్మాణాలను పూర్తిచేయాలి


ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కారంచేడు: నిర్మాణంలో ఉన్న గృహాలను త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డీ విజయలక్ష్మి ఆదేశించారు. సోమవారం ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో పర్చూరు, కారంచేడు మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడారు. కారంచేడు మండలంలోని 14 గ్రామాల పరిధిలో మొత్తం 480 గృహాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో 64 గృహాలు పూర్తికాగా మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వర్క్ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మీ గ్రామాల్లో మంజూరు అయిన గృహాలను త్వరగా పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచెయ్యాలన్నారు. మన ముందు ఉన్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌డీ ఖాశీంసాహెబ్, రాజ్‌కుమార్, రెండు మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన అతిథులు

మేదరమెట్ల: మహిళలు ఆర్థిక పురోగవృద్ధి వైపు పయనించినప్పుడే వారు జీవనోపాధులు పెంపొందించుకోవడానికి వీలు ఉంటుందని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మండల కేంద్రం కొరిశపాడులో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 40 మంది మహిళలు డ్రస్ మేకింగ్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణా సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కే.శ్యామ్‌సునీల్ మాట్లాడుతూ డిమాండ్ కలిగిన మోడళ్లను తయారు చేసుకోవడం వలన ఎక్కువ సేల్ ఉంటుందన్నారు. సీడీపీవో ఇందిర, ట్రైనింగ్ కోర్సు శిక్షకురాలు జయంతి, జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ వీరయ్య పాల్గొన్నారు.